సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



బ్లాస్ట్‌ఫర్నేస్‌-1లో ఉత్పత్తికి చర్యలు

స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్‌-1 (గోదావరి) ఉత్పత్తికి యుద్ధప్రాతిపాదికన సిద్ధమవుతోంది. IIలో



జాతీయ అవార్డు

నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేస్తున్న ఏపీఈపీడీసీఎల్‌కు జాతీయ అవార్డు లభించింది. IIలో



ఏయూలో రెక్టార్‌ తనిఖీలు

విశాఖ సిటీ: ఏయూలోని పలు విభాగాలను గురువారం రెక్టార్‌ ఆచార్య ఎన్‌.కిషోర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్‌

వైఎస్‌ జగన్‌ను కలిసిన ఉమ్మడి విశాఖ జిల్లా నేతలు



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: విజయనగరం పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి విచ్చేసిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్‌ కోఆర్డినేటర్‌ వి.విజయసాయిరెడ్డి, అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, విశాఖ మేయర్‌ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్‌, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌, డిప్యూటీ మేయర్‌ కె.సతీష్‌, మాజీ కార్పొరేషన్‌ చైర్మన్లు కొండా రాజీవ్‌ గాంధీ, ఆల్ఫా కృష్ణ, ముఖ్యనేతలు శరగడం చినఅప్పలనాయుడు, దేవాన్‌రెడ్డి, గండి రవి, మొల్లి అప్పారావు, ద్రోణంరాజు శ్రీవాత్సవ్‌, జి.నాగేంద్ర తదితరులు కలిశారు.

డీఎస్‌ఈవోగా అప్పారావునాయుడు

- ఏలూరు డీఈవోగా వెంకటలక్ష్మమ్మ బదిలీ



అప్పారావు నాయుడు

సాక్షి, అనకాపల్లి: డిస్ట్రిక్ట్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ ఆఫీసర్‌ (డీఎస్‌ఈవో)గా జి.అప్పారావునాయుడు నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అసిస్టెంట్‌ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అప్పారావునాయుడుకు అనకాపల్లి డీఎస్‌ఈవోగా పూర్తి అదనపు బాధ్యత (ఎఫ్‌ఏసీ) అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటలక్ష్మమ్మను ఏలూరు డీఈవోగా బదిలీ చేశారు.

డీఆర్వోగా సత్యనారాయణ

సాక్షి, అనకాపల్లి: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా వై.ఎస్‌.వి.కె.జి.ఎల్‌.సత్యనారాయణను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.దయానిధిని విజయవాడలో గల సాధారణ పరిపాలనా విభాగానికి రిపోర్టు చేయమని జీవోలో పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌ కుమార్‌ ప్రసాద్‌ ఉత్తర్వులు జారీ చేశారు.

- సర్వసభ్య సమావేశంలో జిల్లా అంశాలను ప్రస్తావించిన జెడ్పీటీసీలు
- రూ.20 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని రోడ్ల మరమ్మతులు చేస్తామని మంత్రి హామీ
- దిశ యాప్‌, పోలీస్‌స్టేషన్‌లు లేకపోవడంతోనే పెరుగుతున్న అత్యాచారాలు
- రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలంటూ కోరిన అరకు ఎంపీ
- వర్షాలకు ఏజెన్సీలో భారీ పంట నష్టం.. పరిహారం అందించాలని సభ్యుల విజ్ఞప్తి

జెడ్పీలో సమస్యల హోరు



వేదికపై హోంమంత్రి అనిత, జెడ్పీ చైర్‌పర్సన్‌ సుభద్ర, విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు హరేందిర ప్రసాద్‌, విజయ కృష్ణన్‌ (పై చిత్రం), సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: తాగునీటి ప్రాజెక్టులు.. గ్రామీణ రహదారులకు క్వారీ లారీ శాపాలు.. బూజు పట్టిన పాఠశాలలు.. ఇలా అనేక సమస్యలను జిల్లాకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్‌ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ జె.సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా సీఈవో పి. నారాయణమూర్తి అజెండా అంశాలను చదివి వినిపించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాల గురించి సంబంధిత అధికారులు వివరించారు. సభ్యులు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని బాగా అమలు చేయాలని, ప్రైవేట్‌ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, పిల్లల భద్రతకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలో భారీగా పంట నష్టం జరిగిందని, పారదర్శకంగా అంచనాలు వేసి పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. ఉపాధి హామీ, కల్వర్టుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, జలజీవన్‌ మిషన్‌ పనులు తదితర అంశాలపై సభ్యులు మాట్లాడారు.

గృహ నిర్మాణాలకు ఇసుక ఉచితమే..

ఇకపై గృహ నిర్మాణాలకు, ఇతర కట్టడాలకు ఇసుక ఉచితంగానే లభిస్తుందని.. స్థానిక అధికారులకు ముందస్తు సమాచారమిచ్చి ఇసుక తెచ్చుకోవచ్చని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు రూ.20 కోట్లతో రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సీజనల్‌ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాలువలకు ఆనుకుని తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేయవద్దన్నారు. రోడ్లకు ఇరువైపులా తుప్పలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో గంజాయికి ప్రత్యామ్నాయంగా పంటలను ప్రోత్సహించాలని సూచించారు.

ఈవోపీఆర్‌డీల బదిలీల మాటేంటి?

ఏజెన్సీలో పనిచేసిన ఈవోపీఆర్‌డీలకు మైదాన ప్రాంతాలకు నియమ నిబంధనల ప్రకారం బదిలీలు జరగలేదని ఆరోపణలున్నాయి.. ఉమ్మడి విశాఖ జిల్లాలో నియమ నిబంధనల ప్రకారం ఈవోపీఆర్‌డీ బదిలీలు ఎందుకు చేయలేదు..కొన్ని చోట్ల ఇంకా ఈవోపీఆర్‌డీలను ఎందుకు నియమించలేదు..? అని అనకాపల్లి, అల్లూరి డీపీవోలను జెడ్పీ చైర్‌పర్సన్‌ జె.సుభద్ర వివరణ కోరారు. దీనిపై సమాధానంగా అనకాపల్లి డీపీవో శిరీషారాణి మాట్లాడుతూ.. జిల్లాలో నక్కపల్లి, పరవాడ, దేవరాపల్లిలో మాత్రమే ఖాళీ ఉందన్నారు. నక్కపల్లి, పరవాడలో నిబంధనల ప్రకారమే నియమించడం జరిగిందన్నారు. దేవరాపల్లిలో ఇంకా నియమించలేదన్నారు, ప్రస్తుతం చీడికాడలో పనిచేసే ఈవోపీఆర్‌డీని ఇన్‌చార్జిగా వేస్తామని డీపీవో బదులిచ్చారు.

చట్రాపల్లికి ఏం చేశారు: ఎంపీ తనూజరాణి

గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొండ చరియలు జారిపడిన జీకే వీధి మండల చట్రాయపల్లి గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల బాధితులకు సత్వర న్యాయం జరగలేదని అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి ధ్వజమెత్తారు. మైదాన ప్రాంతంలో వివిధ కర్మాగారాల్లో సంభవించిన ప్రమాదాల్లో మరణిస్తే ఆయా కుటుంబాలకు రూ.కోట్లలో ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వం మన్యంలో ఆదివాసీ గిరిజన ప్రజల ప్రాణాలంటే ఎందుకు లెక్క లేదని ప్రశ్నించారు. ప్రాథమికోన్నత పాఠశాలలను జెడ్పీ ఉన్నత పాఠశాలలుగా స్థాయి పెంచి అక్కడ విద్యార్థులకు హాస్టల్‌ వసతి కల్పించాలని కోరారు. దిశ యాప్‌, దిశ పోలీస్‌స్టేషన్లు లేకపోవడంతోనే గిరిజన ప్రాంతాల్లో అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు.

స్టీల్‌ప్లాంటు విషయంలో స్థానిక ఎంపీ పార్లమెంటులో ప్రస్తావించాలని, న్యాయం చేయాలని ఓ సభ్యుడు విన్నవించగా విశాఖ ఎంపీ శ్రీభరత్‌ సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్రం నుంచి సానుకూల పరిణామాలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే స్థానికంగా స్పందిస్తామని ఎంపీ స్పష్టం చేశారు.

చుట్టపుచూపుగా 'అధికార' ప్రజాప్రతినిధులు

ప్రజా సమస్యలు అధికారపార్టీ ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశానికి కూటమి ప్రజాప్రతినిధులు చుట్టపుచూపులా వచ్చి వెళుతున్నారు. తొలి సమావేశానికి కనీసం మంత్రులు కూడా రాలేదు. ఇది రెండో సర్వసభ్యసమావేశం కాగా..ప్రజాప్రతినిధులు రానేరాలేదు. తొలుత పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఇద్దరూ వచ్చి గంట పాటు ఉండి వెళ్లిపోయారు. హోంమంత్రి వంగలపూడి అనిత అరగంట పాటు ఉండి వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విశాఖ ఎంపీ శ్రీభరత్‌ వచ్చి కొద్దిసేపు తరువాత వెళ్లిపోయారు. ఇక మిగతా అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎవ్వరూ రాలేదు. వచ్చిన అధికార ప్రతినిధులు కూడా కేవలం ఫోటోలు ఫోజులివ్వడానికే పరిమితమయ్యారన్న విమర్శలు వినవచ్చాయి.



అధికార పార్టీ ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టడంతో ఖాళీగా కుర్చీలు

డోలీ మోత నుంచి విముక్తి కల్పించండి



విశాఖ జెడ్పీ కార్యాలయం వద్ద డోలీలతో గిరిజన మహిళల ప్రదర్శన

మహారాణిపేట (విశాఖ): తరాలు మారినా తలరాతలు మారలేదని ఆవేదన చెందారు.. తమకు ఎన్నాళ్లీ కష్టాలని నిలదీశారు.. డోలీ మోతల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ గిరిజన మహిళలు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టారు. గురువారం విశాఖలో జిల్లా పరిషత్‌ పాలకవర్గ సర్వసభ్య సమావేశం జరిగిన సందర్భంగా తమ కష్టాలు అందరికీ తెలిసేలా ప్రదర్శన జరిపారు. రోగులను, గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు తాము కొండ కోనల్లో ఎంత కష్టపడుతున్నామో అర్థమయ్యేలా డోలీ కట్టి మరీ చూపించారు. ఆదివాసీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్‌ సాధన కమిటీ సభ్యుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల పరిధిలో జాజులబంద, నీలబంద, దాయర్తి గిరిజన గ్రామాలకు, కొయ్యూరు మండలం మూలపేట, రోలుగుంట మండలం పిత్రగడ్డ, నీలబంద, పెదబుగోరు గ్రామాలను కలుపుతూ రోడ్లు వేయాలని కోరారు. ఈ రెండు జిల్లాల కలెక్టర్లు స్వయంగా పై గ్రామాలను పరిశీలించి న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.వెంకటరావు, కె.చిన్నారావు, రాజారావు పాల్గొన్నారు.

సమస్యలపై గళమెత్తిన సభ్యులు..



ఎంపీపీ సూరిబాబు

- అనకాపల్లి మండలం సంపత్‌పురంలో వైఎస్సార్‌ హయాంలో రూ.90 కోట్లతో నిర్మించిన తాగునీటి పైప్‌లైన్లు పాడై 10 గ్రామాలకు నీరు అందడం లేదని ఎంపీపీ గొర్లి సూరిబాబు చెప్పారు. తాను అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జల్‌జీవన్‌ మిషన్‌ కింద ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు గతంలో రూ.11 కోట్లు మంజూరు చేశామని, ఇంకా రూ.9 కోట్లు ఇవాల్సి ఉందని చెప్పగా.. కలెక్టర్‌ స్పందించి త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
- మునగపాక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో బూజులు దులిపిస్తున్నారని, తరగతి గదులు శుభ్రం చేయిస్తున్నారని జెడ్పీటీసీ ప్రస్తావించారు.
- రాంబిల్లిలో 108 అంబులెన్స్‌ ఏర్పాటు చేయాలని రాంబిల్లి జెడ్పీటీసీ కోరారు.
- అనకాపల్లి మండల పరిధిలో క్వారీ వాహనాలు గ్రామాల్లో నుంచి వెళుతుంటే రోడ్లు గుంతలు పడి, కాలుష్యం వ్యాపిస్తోందని కో ఆప్షన్‌ సభ్యుడు పెతకంశెట్టి శివ సత్యనారాయణ చెప్పారు.
- గత ప్రభుత్వంలో రోడ్లకు ఇరువైపులా తుప్పలు తొలగించకపోవడం వల్లనే వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందని హోం మంత్రి అనిత అనడం సరికాదని, నాలుగు నెలల కూటమి ప్రభుత్వ కాలంలోనే తుప్పలు పెరిగాయని బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ రాంబాబు అన్నారు.

- బాలికపై కేర్‌ టేకర్‌ లైంగిక వేధింపులు
- లైనుకొత్తూరు న్యూలైఫ్‌ హాస్టల్‌లో ఘటన
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు
- గోప్యంగా ఉంచిన పోలీసులు

హాస్టల్‌లో కీచక పర్వం

యలమంచిలి రూరల్‌: విద్యార్థినులకు రక్షణగా ఉండాల్సిన వార్డెన్‌ వారిని లైంగికంగా వేధించాడు. కంటి పాపలా చూడాల్సిన వాడే కాటేసే ప్రయత్నం చేశాడు. బాలికలు ధైర్యం చేసి తల్లికి ఈ విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు విషయాన్ని గోప్యంగా ఉంచారు. యలమంచిలి మండలం లైనుకొత్తూరు న్యూలైఫ్‌ హాస్టల్‌లో కేర్‌ టేకర్‌ 9వ తరగతి బాలిక(13)పై లైంగిక వేధింపులకు పాల్పడిన దారుణం ఆలస్యంగా వెలుగు చూసింది. రామకృష్ణాపురం కాలనీ చివర న్యూలైఫ్‌ హాస్టల్‌ ఉంది. ఇక్కడ సుమారు 40 మంది పేద విద్యార్థులు చదువుకునేందుకు నిర్వాహకులు వసతి కల్పించారు. వసతి పొందుతున్న బాలబాలికలంతా యలమంచిలి పట్టణంలో స్కూళ్లలో చదువుకుంటున్నారు. వసతి పొందుతున్న బాలబాలికలకు సంరక్షకులుగా మాకవరపాలెం మండలం ఎరకన్నపాలేనికి చెందిన రావాడ శ్రీను (30), అతని భార్య వ్యవహరిస్తున్నారు. శ్రీను కుటుంబం న్యూలైఫ్‌ హాస్టల్‌లోనే నివాసం ఉంటోంది. వసతి పొందుతున్న వారిలో మాకవరపాలెం మండలానికి చెందిన 9, 7వ తరగతులు చదువుతున్న అక్కాచెల్లెళ్లు ఉన్నారు. 9వ తరగతి చదువుతున్న బాలికపై సంరక్షకుడు శ్రీను తరచూ లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన బాలిక తనపై జరుగుతున్న వేధింపుల విషయం తల్లికి చెప్పుకుంది. దీంతో పిల్లలిద్దర్నీ తన గ్రామానికి దగ్గర్లో ఉన్న స్కూల్లో చేర్పించాలని నిర్ణయించుకున్న తల్లి ఈ నెల 14న యలమంచిలిలో తన కుమార్తెలు చదువుతున్న కొత్తపేట జెడ్పీ పాఠశాలకు వచ్చి టీసీలు తీసుకుని వెళ్లిపోయింది.

బాలికపై దాడి.. నిందితుడికి స్టేషన్‌ బెయిల్‌

దసరా సెలవుల అనంతరం బాలికలిద్దరూ హాస్టల్‌కు రాకపోవడం, టీసీలు తీసుకున్నారని తెలిసిన వార్డెన్‌ శ్రీను ఇటీవల బాలికల ఇంటికి వెళ్లి 9వ తరగతి బాలికపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. దీంతో భయపడిన తల్లి కామాంధుడిగా మారిన కేర్‌ టేకర్‌ వేధింపులు తట్టుకోలేక అతడిపై తన కుమార్తెతో యలమంచిలి రూరల్‌ పోలీసులకు ఫిర్యాదు చేయించింది. ఈ మేరకు ప్రాథమిక విచారణ జరిపిన పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. అయితే బెయిలబుల్‌ సెక్షన్లు (ఏడేళ్లలోపు శిక్ష పడే) కావడంతో నిందితుడ్ని స్టేషన్‌ బెయిల్‌పై విడుదల చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 18వ తేదీన ఈ హాస్టల్‌ను వసతి గృహాల తనిఖీలో భాగంగా యలమంచిలి న్యాయమూర్తితో కూడిన బృందం ఆకస్మిక తనిఖీ చేసినప్పటికీ.. నిర్వాహకులు, పోలీసులు గోప్యంగా ఉంచడంతో విషయం బయటకు రాలేదు.



లైనుకొత్తూరు న్యూలైఫ్‌ హాస్టల్‌

పోక్సో కేసు నమోదు చేశాం

బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు న్యూలైఫ్‌ హాస్టల్‌ సంరక్షకుడు శ్రీనుపై కేసు పోక్సో కేసు నమోదు చేశామని యలమంచిలి రూరల్‌ ఎస్సై ఉపేంద్ర చెప్పారు. హాస్టల్‌కు వెళ్లి విచారణ జరుపగా మిగతా బాలికలెవరూ ఎలాంటి ఇబ్బందులు ఉన్నట్టు చెప్పలేదన్నారు. కేసులో సెక్షన్ల ప్రకారం నిందితుడికి స్టేషన్‌ బెయిల్‌ ఇచ్చామన్నారు.

మత్తు వదిలిస్తారు..

- జిల్లా పోలీస్‌ కార్యాలయంలో ఎన్‌డీపీఎస్‌ సెల్‌ ఏర్పాటు
- ప్రారంభించిన ఎస్పీ తుహిన్‌ సిన్హా



ఎన్‌డీపీఎస్‌ సెల్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

అనకాపల్లి : జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు, దాడులు నిర్వహించేందుకు కేంద్రీకృత ఎన్‌డీపీఎస్‌ సెల్‌కు ప్రత్యేకంగా పోలీస్‌ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తుహిన్‌ సిన్హా అన్నారు. తమ కార్యాలయం పరిధిలో ఒక ప్రత్యేక గదిని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా జరిగే వివిధ మార్గాలు, అనుమానాస్పద గ్రామాలు, ప్రదేశాలు, వ్యక్తులపై నిఘా కొనసాగించడం జరుగుతుందన్నారు. స్టాటిక్‌, డైనమిక్‌ చెక్‌పోస్టులను బలోపేతం చేయడం, వివిధ కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న గంజాయి నిందితులను అరెస్టు చేసేందుకు, పట్టుబడిన గంజాయి కేసుల్లో నిందితులకు కోర్టుల్లో కఠినంగా శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గంజాయి ముఠాల్లో అసలు వ్యక్తులను అరెస్టులు చేయడానికి సాంకేతిక సహాయం అందించేందుకు ఈ కార్యాలయం నుంచి పర్యవేక్షణ ఉంటుందన్నారు. రైల్వే స్టేషన్‌, ఆర్టీసీ కాంప్లెక్స్‌ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద ప్రాంతాల వద్ద గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించే స్నిఫర్‌ డాగ్స్‌తో ఇప్పటికే తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా స్కూల్స్‌, కళాశాలల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై, గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన వ్యక్తుల జైలు శిక్షపై అవగాహన కార్యక్రమాలు దశలవారీగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్‌, ఎల్‌.మోహన్‌రావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

- నాసిరకం భోజనంపై యలమంచిలి వసతిగృహం విద్యార్థినుల ఆగ్రహం
- ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన..
- వాహనాల రాకపోకలకు ఆటంకం
- పోలీసు అధికారులు నచ్చజెప్పడంతో శాంతించిన విద్యార్థినులు

హాస్టల్‌లో ఆకలి మంటలు..

రోడ్డెక్కిన విద్యార్థినులు



ఏబీసీడబ్ల్యూవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థినులు



ప్రధాన రహదారిపై మానవహారం మధ్యలో విద్యార్థినుల వంటా వార్పు



విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్‌: వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతిగృహంలో 120 మంది విద్యార్థినులు.. వీరంతా స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్‌, డిగ్రీ, పీజీ, బీఈడీ కోర్సులు చదువుతున్నవారు. హాస్టల్లో ఎంతో కాలంగా ఆహార మెనూ సక్రమంగా అమలు చేయకపోవడం.. నాసిరకమైన పదార్థాలు వండి పెట్టడంతో రుచి లోపిస్తోందని పలుమార్లు సంక్షేమాధికారితోపాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ విద్యార్థినులను సర్దుకోమని నచ్చజెప్పడమే తప్ప సమస్యలు పరిష్కరించకపోవడంతో విసుగు చెంది ఆందోళన బాట పట్టారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో తమకు మద్దతుగా నిలిచిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి విద్యార్థినులంతా పట్టణంలోని సహాయ వెనుకబడిన తరగతుల అధికారి కార్యాలయం వద్దకు చేరుకుని కార్యాలయానికెదురుగా రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకుని కార్యాలయం వద్దకు వచ్చిన ఏబీసీడబ్ల్యూ జి.నాగేశ్వరరావుతో విద్యార్థినులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వాగ్వాదానికి దిగారు. వంట సిబ్బందిని మార్చాలని తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌ చేయగా వెంటనే పరిష్కరించడం తన వల్ల కాదని ఆయన చెప్పడంతో ఆగ్రహానికి గురైన విద్యార్థినులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ర్యాలీగా వచ్చి గ్రామీణ వికాస్‌ బ్యాంకు ఎదురుగా ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు.

గంట సేపు నిలిచిపోయిన ట్రాఫిక్‌

విద్యార్థినుల ఆందోళనతో ప్రధాన రహదారిపై సుమారు గంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యార్థినుల ఆందోళన విషయం తెలుసుకున్న యలమంచిలి సీఐ ధనుంజయరావు, రూరల్‌ ఎస్సై ఉపేంద్ర అక్కడకు చేరుకుని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పడంతో వారంతా ఆందోళన విరమించారు. తహసీల్దార్‌ వరహాలుకు సీఐ సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి ఆయన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఇచ్చిన వినతి పత్రం తీసుకున్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన ఏబీసీడబ్ల్యూ నాగేశ్వరరావు కూడా జిల్లా బీసీ సాధికారత అధికారి రాజేశ్వరితో మాట్లాడగా వెంటనే వసతి గృహంలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందిని అనకాపల్లిలో ఉన్న తన కార్యాలయానికి రావాలని ఆదేశించారు. విద్యార్థినుల హాస్టల్‌కు వేరే సిబ్బందిని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు తెనుగుపూడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన టెన్నికాయిట్ సెలక్షన్‌లో స్థానిక గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థి పి.సాయికుమార్ అండర్-17 విభాగంలోను, 9వ తరగతి విద్యార్థి ఎస్.మణికుమార్ అండర్-14 విభాగంలోను సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులతో పాటు తర్ఫీదునిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.తరుణేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావును గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ పి.రఘు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇరటా నర్సింహమూర్తి, తదితరులు అభినందించారు.

తైక్వాండో పోటీలకు డైట్ కళాశాల విద్యార్థిని


విద్యార్థిని జయశ్రీ

తుమ్మపాల: పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో వచ్చే నెల 13, 14 తేదీల్లో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీలకు స్థానిక దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థిని ఎంపికైంది. సెకండియర్ ఈసీఈ బ్రాంచ్ విద్యార్థిని యూ.జయశ్రీ ఈ పోటీల్లో పాల్గొంటుందని కళాశాల పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల జరిగిన జేఎన్‌టీయూ జీవీ విశ్వవిద్యాలయ అంతర కళాశాల తైక్వాండో పోటీల్లో ఆమె సత్తా చాటారు. ఎంపికైన విద్యార్థిని జయశ్రీని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రైతుకు డ్రోన్ సాయం

- డ్రోన్ సహాయంతో పురుగు మందు పిచికారీ
- శాస్త్రవేత్తల విస్తృత పరిశోధనలు
- ఆర్‌ఏఆర్‌ఎస్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రధాన శాస్త్రవేత్త జగన్నాథరావు వెల్లడి


ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో మొక్కజొన్న పంటపై డ్రోన్ సహాయంతో పురుగు మందు పిచికారీ చేస్తున్న శాస్త్రవేత్తలు

అనకాపల్లి: డ్రోన్ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. పక్కాగా పురుగు మందులు పిచికారీ చేయడంలో సత్ఫలితాలిస్తోంది. ఈ మేరకు స్థానిక ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం డ్రోన్ సహాయంతో మొక్కజొన్న పంటపై పురుగు మందు పిచికారీ ప్రక్రియను గురువారం ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిశోధనా స్థానం ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త పీవీకే జగన్నాథరావు మాట్లాడుతూ రైతులు డ్రోన్ సహకారంతో పురుగు మందులు, చీడపీడల నివారణ మందులు, జీవ నియంత్రణ కారకాలతో పిచికారీ చేయడంపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు జీవ నియంత్రణ కారకాలైన మెటరైజియంను ఉపయోగించి డ్రోన్ సహాయంతో పంటపై భాగం నుంచి వివిధ ఎత్తుల్లో (0.6మీ, 1.1 మీ, 1.5 మీ,) వివిధ వేగాలతో(3.5 మీ/ఎస్, 4 మీ/ఎస్, 4.5 మీ/ఎస్) నడిపి పక్కాగా పిచికారీ చేశామన్నారు. ఎంత ఎత్తు, ఎంత వేగంతో పురుగు మందు ద్రావణం పంట మీద నిర్దిష్ట పరిమాణంలో పడుతుందో, కత్తెర పురుగు నివారణ, పంట దిగుబడిపై ఏ విధంగా ప్రభావం చూపుతుందో గుర్తించామన్నారు. గత రెండేళ్లలో జరిపిన పరిశోధనలో డ్రోన్‌ను 4మీ/ఎస్ వేగంతో నడిపినప్పుడు, 1.1 మీ. ఎత్తులో నడిపినప్పుడు చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిసిందన్నారు. రైతువారీ పద్ధతిలో(పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ) సమాన దిగుబడులు ఆర్జించడం జరుగుతుందని ఆయన చెప్పారు. చెరకు పంటలో తెగుళ్ల నివారణకు డ్రోన్‌ను ఉపయోగించి పురుగు మందులు, ద్రవ పోషకాలను పిచికారీ చేయడానికి డ్రోన్ ఎత్తు, వేగం నిర్ధారించడానికి ప్రయోగాలు జరుగుతున్నాయన్నారు. డ్రోన్‌ను మొక్క పైభాగం నుంచి 0.6మీ, 1 మీ, 3 మీ, 4 మీ, ఎత్తులోను, 2 మీ/ఎస్, 3 మీ/ఎస్, 4.5 మీ/ఎస్, 5.5 మీ/ఎస్ వేగంతో నడిపి కోరుజిన్, యోనోక్రోటోఫాస్ వంటి పురుగు మందును, జింక్, పొటాష్, ద్రవ పోషకాలను పిచికారీ చేయవచ్చునన్నారు. ఉత్తర కోస్తా జిల్లాల్లో ప్రధాన పంటలైన చెరకు, మొక్కజొన్నలలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీపై పరిశోధనలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పి.శ్రీదేవి, జి.కుసుమ, సీహెచ్.ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాతో రైతులకు భరోసా


వ్యవసాయ శాఖ సమీక్షలో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

- పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి
- జాయింట్ కలెక్టర్ జాహ్నవి

తుమ్మపాల: ప్రకృతి విపత్కర సమయంలో భరోసానిచ్చే పంటల బీమా పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి కోరారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ పంటల బీమాపై గురువారం జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీకి సంబంధించి పంటల బీమాపై ఆయన ఆదేశాల మేరకు కాన్ఫరెన్స్ అనంతరం జేసీ వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల బీమాకు సంబంధించి ఇతరుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా ప్రీమియం కట్టుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రైతు, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంటల బీమాతో కలిగే ఉపయోగాలను రైతులకు తెలియజేసి, అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆమె సూచించారు. గడువులోగా ప్రీమియం చెల్లించేలా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. రబీకి సంబంధించి జీడి పంటకు నవంబరు 15, ఇతర పంటలకు డిసెంబరు 15 ఆఖరు తేదీగా నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయండి

- వార్డెన్ హరిగోపాల్‌కు జడ్జి ఆదేశాలు


రోలుగుంట బీసీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన సివిల్ జడ్జి సియాజ్ ఖాన్

రోలుగుంట: వసతి గృహంలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మేలైన విద్య అందించాలని వార్డెన్ హరిగోపాల్‌ను నర్సీపట్నం మండల లీగల్ సర్వీసు కమిటీ సివిల్ జడ్జి సియాజ్‌ఖాన్ ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన న్యాయస్థాన సిబ్బందితో కలసి స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో వంటల తయారీని పరిశీలించారు. స్టాక్ రూములో ఉన్న బియ్యం, కూరగాయలను రికార్డులతో సరిపోల్చారు. విద్యార్థుల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ డామేజీ అయి, శ్లాబ్ పెచ్చులూడడం, విద్యుత్ వైర్లు వేలాడి ప్రమాదకరంగా ఉండడాన్ని గుర్తించారు. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారా లేదా అని వార్డెన్‌ను అడిగారు. వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. సమస్యల గురించి వెంటనే ప్రభుత్వానికి నివేదించాలని వార్డెన్‌కు సూచించారు.

ఏపీఈపీడీసీఎల్‌కు జాతీయ అవార్డు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) మరో జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. ఈ నెల 22 నుంచి 23వ తేదీ వరకు ఢిల్లీలో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 18వ జాతీయ ఇంధన సదస్సు జరిగింది. ఇంధన రంగంలో వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సంస్థలకు 12వ ఇన్నోవేషన్ ఇంపాక్ట్ అవార్డ్స్ ఫర్ డిస్కమ్స్ పేరిట అవార్డులు ప్రదానం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్న ఏపీఈపీడీసీఎల్‌కు 'కేటగిరీ ఎఫ్-ఇన్నోవేషన్ విత్ ఇంపాక్ట్-లార్జ్ డిస్కమ్స్'లో అవార్డు లభించింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అనిల్ రాజ్‌దన్ చేతుల మీదుగా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది ఉత్తమ పనితీరుకు నిదర్శనంగా సంస్థ జాతీయ అవార్డును సొంతం చేసుకుందన్నారు.

31న అప్పన్న దర్శన వేళల్లో మార్పులు

సింహాచలం(విశాఖ): దీపావళి పురస్కరించుకుని ఈ నెల 31న వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనాలు సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే లభిస్తాయని సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు తెలిపారు. నవంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు ఆలయంలో మనవాళ్ల మహామునులు తిరునక్షత్రం పూజలు నిర్వహించనున్నారు. ఆ రోజుల్లో స్వర్ణ పుష్పార్చన, స్వర్ణ తులసీ దళార్చన, గరుడసేవ, నిత్య కల్యాణం సేవలను రద్దు చేశారు.

జైలు డీఎస్‌గా జవహర్ బాబు



ఆరిలోవ (విశాఖ): విశాఖ కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్(డీఎస్)గా కె.జవహర్ బాబు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎస్-1గా పనిచేసిన రామచంద్రరావు గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానాన్ని ఇంకా భర్తీ చేయలేదు. డీఎస్-2గా పని చేస్తున్న కమలాకరరావును ఇటీవల కడప కేంద్ర కారాగారానికి అటాచ్‌మెంట్‌లో భాగంగా పంపించారు. ఆయన స్థానంలో కడప నుంచి వచ్చిన జవహర్ బాబు ఇటీవల బాధ్యతలు స్వీకరించారని సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ తెలిపారు.

బ్లాస్ట్‌ఫర్నేస్-1లో ఉత్పత్తికి చర్యలు


బ్లాస్ట్‌ఫర్నేస్-1లో పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

ఉక్కునగరం(విశాఖ): స్టీల్‌ప్లాంట్‌లోని బ్లాస్ట్‌ఫర్నేస్-1(గోదావరి) ఉత్పత్తికి సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి పనులు యుద్ధప్రాతిపాదికన జరుగుతున్నాయి. ఆరు నెలల తర్వాత ప్రారంభమవుతున్న ఈ బ్లాస్ట్‌ఫర్నేస్ ఉత్పత్తిపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. గతంలో బీఎఫ్-1, బీఎఫ్-2లు ఉత్పత్తి ప్రక్రియలో కొనసాగేవి. స్టీల్‌ప్లాంట్‌కు ఏర్పడ్డ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఐరన్ ఓర్, బొగ్గు కొరత ఏర్పడ్డాయి. దాంతో ఆరు నెలల క్రితం బీఎఫ్-1ను తాత్కాలికంగా నిలిపి వేశారు. అప్పటి నుంచి బ్లాస్ట్‌ఫర్నేస్-2లో మాత్రమే ఉత్పత్తి కొనసాగుతోంది. దీంతో ప్లాంట్ కేవలం మూడో వంతు ఉత్పత్తి మాత్రమే చేయగలుగుతోంది. నెల రోజులుగా కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సమీక్షల ఫలితంగా ప్లాంట్‌కు రూ.1,650 కోట్ల ప్యాకేజీ లభించింది. దాంతో ముడి సరకులు కొనుగోలు చేశారు. ఉక్కు యాజమాన్యం ఈ నెల 27న ఈ ఫర్నేస్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. ఎటువంటి ఆటంకం ఏర్పడకపోతే నిర్ణీత వ్యవధిలో ఫర్నేస్ ప్రారంభించే అవకాశం ఉంది. రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు నడిచి ఉత్పతి కొనసాగిస్తే ఉద్యోగులకు కొంత ఉపశమనం కలుగుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నాతవరం: మండలంలో పెదగొలుగొండపేట గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరం పోలీసులు గురువారం దాడి చేశారు. ముగ్గుర్ని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నాతవరం ఎస్‌ఐ సిహెచ్.భీమరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం అందిన సమాచారం మేరకు పెదగొలుగొండపేట గ్రామంలో దాడులు చేశామన్నారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ 4,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కొట్టాం గ్రామానికి చెందిన ఆకుల గంగా నాగేశ్వరరావుపై ఇప్పటికే పలు కేసు నమోదై ఉండడంతో ఆయనను నర్సీపట్నం సబ్‌జైల్లో రిమాండ్‌కు కోర్టు పంపించిందని ఎస్‌ఐ తెలిపారు. మిగతా ఇద్దరు నిందితులను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు.

మూడు పశువుల పాకలు దగ్ధం


పరవాడపాలెంలో దగ్ధమవుతున్న పశువుల పాకలు

కశింకోట: మండలంలోని పరవాడపాలెం సమీపంలోని పొలాల్లో ఉన్న మూడు పశువుల పాకలు బుధవారం రాత్రి దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఓ ఆవు దూడ, 50 వరకు నాటు కోళ్లు మృతి చెందాయి. వరి కుప్ప కాలి బూడిదైపోయింది. రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగిందని అంచనా. అకస్మాత్తుగా మంటలు వ్యాపించి గొంతిన రమణ, గొంతిన జగ్గారావు, పరవాడ అప్పలనాయుడులకు చెందిన పశువుల పాకలు వరుసగా ఆహుతయ్యాయి. జగ్గారావుకు చెందిన ఒక ఆవు పెయ్యి మంటల్లో కాలి మృతి చెందింది. ఇక రమణకు చెందిన వరి కుప్ప దగ్ధమైంది. అప్పలనాయుడు పాకలో ఉన్న సుమారు 50 పెంపుడు నాటు కోళ్లు ఈ ప్రమదాం మృతి చెందాయి. విషయం తెలుసుకున్న స్థానికులు ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ప్రమాదానికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. అయితే గిట్టని వారు ఎవరో నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన రామకృష్ణ

పాయకరావుపేట: స్థానిక జాతీయ రహదారిపై నామవరం గ్రామం వద్ద వెనక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ జె.పురుషోత్తం తెలిపారు. నక్కపల్లి నుంచి తుని వైపు బైక్‌పై వెళ్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలానికి చెందిన నక్క రామకృష్ణ(45)ను అదే మార్గంలో అతి వేగంగా వెనక నుంచి ఓ లారీ ఢీకొట్టింది. దీంతో రామకృష్ణకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

100 రోజుల పాలన..
మోసాల ఘనత


అనకాపల్లి-విజయనగరం ఆర్టీసీ బస్‌లో పోస్టుకార్డులతో మహిళలకు ఉచిత ప్రయాణం కోరుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బన్న
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం పోస్టుకార్డు ఉద్యమం

అనకాపల్లి : కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేయడంలో, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడంలో, 100 రోజుల పాలనలో గొప్ప విజయం సాధించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఎద్దేవా చేశారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోస్టుకార్డుల ఉద్యమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు మాసాలు అవుతున్నప్పటికీ పథకాలు అమలు చేయడం కంటే, మద్యం, ఇసుక పాలసీలపై కోట్లాది రూపాయలు కూడబెట్టుకోవడంపైనే కూటమి నాయకులు శ్రద్ధ చూపుతున్నారని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ఉద్యమాలు చేస్తామని అన్నారు. ఈ పోస్టుకార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సమన్వయకర్త గురునాథం, జిల్లా నాయకులు భానుమూర్తి యాదవ్, కె.వి.మాణిక్యం, సేనాపతి రాజు, కె.ఏడుకొండలు, తట్టా రమణ, పి.ఈశ్వర్‌దత్తు, టి.అనంతరావు, పడాల కొండలరావు, వి.రాము పాల్గొన్నారు.

ఇదేం 'పచ్చ'పాతం

- ఇసుక అక్రమ లోడు పట్టిస్తే పోలీసులు వదిలేశారు..
- బోయిలకింతాడలో స్థానికుల ఆగ్రహం


బోయిలకింతాడలో ఇసుక లోడు చేస్తున్న లారీ

దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ శారదానది సమీపంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని గురువారం స్థానికులు పట్టుకొని దేవరాపల్లి పోలీసులకు అప్పగించారు. ఇసుక లోడుతో ఉన్న లారీని అక్కడి నుంచి కొంత దూరం తీసుకెళ్లిన పోలీసులు వదిలేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న లారీని స్థానిక ప్రజలు స్వయంగా ఫోన్ చేసి మరీ అప్పగిస్తే కేసు నమోదు చేయలేదు సరికదా, కనీసం పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా మధ్యలోనే వదిలేశారు. దీంతో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు లారీతో ఇసుక తరలిస్తున్న వ్యక్తి కె.కోటపాడు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు కావడంతో పోలీసులకు ఒత్తిళ్ల వచ్చాయా, లేదా లాలూచీ పడ్డారా? అని జనం చర్చించుకుంటున్నారు. దేవరాపల్లిలో పంట పొలాల్లోకి రైతులు మట్టి తీసుకుంటే ఆగమేఘాల మీద కేసులు నమోదు చేసిన పోలీసులు, పట్టపగలే నిబంధనలను ఉల్లంఘించి దర్జాగా లారీతో ఇసుక తరలించుకుపోతే విడిచిపెట్టిన తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఉన్నతాధికారులకు తగు ఆధారాలతో ఫిర్యాదులు చేసేందుకు పలువురు సిద్ధమవుతున్నారు.

వేములపూడి సామిల్లుపై విజిలెన్స్ దాడులు

నర్సీపట్నం : నర్సీపట్నం మండలం వేములపూడి శ్రీనివాస సామిల్లుపై స్టేట్ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. కోటవురట్ల మండలం, అన్నవరం సామిల్లులో అక్రమ కలప కోత జరుగుతుందని స్టేట్ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు స్టేట్ విజిలెన్స్ డీఎఫ్‌వో ధర్మరక్షిత్ సిబ్బందితో కలిసి ఈ నెల 22న దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ మిల్లులో కలప అక్రమ నిల్వలు లేవని అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా వేములపూడి శ్రీనివాస సామిల్లుపై గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమ కలప కోస్తుండగా ఫారెస్ట్ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. కలపను స్వాధీనం చేసుకుని, మిల్లులోని పనులు నిలిపివేశారు.

జోనల్ కమిషనర్ ఎక్కడ?

- టౌన్ ప్లానింగ్ అధికారి లేక నిలిచిన నిర్మాణాలు
- పబ్లిక్ హెల్త్ అధికారి లేక పారిశుధ్య లోపం
- అన్ని విభాగాల్లోనూ పోస్టులు ఖాళీ..!

పట్టణ పాలన గాడి తప్పుతోంది. జోనల్ కార్యాలయానికి ఆయువుపట్టు వంటి కమిషనర్ పోస్టుతోపాటు టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ విభాగాల్లో కీలకమైన పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దాంతో పట్టణ సమస్యలు అపరిష్కృతంగా పేరుకుపోతున్నాయి. గృహ నిర్మాణాలకు అనుమతి కావాలంటే విశాఖ వెళ్లాలని ఉచిత సలహా ఇస్తున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇతర విభాగాల్లోనే ఇటువంటి పరిస్థితే ఉంది.



జోనల్ కార్యాలయం

అనకాపల్లి: పట్టణంలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలో జోనల్ కార్యాలయం ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో అనేక ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మూడు మాసాలుగా జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టులు భర్తీ కాలేదు.

అనకాపల్లి మున్సిపాలిటీని 2013 ఆగస్టులో విశాఖ జీవీఎంసీలో విలీనం చేశారు. అప్పటికే పట్టణ పరిధిలో 32 వార్డులతో పాటు రాజుపాలెం, ఎరుకువానిపాలెం, వల్లూరు, కొప్పాక, సిరసపల్లి, కొత్తూరు, మారేడుపూడి గ్రామాలను జీవీఎంసీలో విలీనం చేశారు. జీవీఎంసీలో విలీనమైనప్పుడు 80, 81, 82, 83, 84 వార్డులుగా ఏర్పాటు చేసి సాలాపువానిపాలెం నుంచి అనకాపల్లి పట్టణం వరకూ జనాభా ప్రాతిపదికను బట్టి విలీన గ్రామాలతో పాటు వార్డులను విభజించారు. జోన్ పరిధిలో అన్ని వర్గాల ప్రజలు సుమారుగా 2 లక్షల మంది జీవిస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ అప్‌గ్రేడ్ అయిన తర్వాత ప్రజలు కష్టాలు తీరుతాయని అంతా ఆనందించారు. అయితే ఇప్పటికీ తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు.

ప్రధాన విభాగంలో అధికారుల కొరత...

జోనల్ కార్యాలయంలో కమిషనర్ సార్వత్రిక ఎన్నికల తర్వాత సాధారణ బదిలీల్లో భాగంగా ఈ నెల 3న రామచంద్రపురం వెళ్లిపోయారు. దాంతో ఈ పోస్టు ప్రస్తుతానికి ఖాళీగా ఉంది. అప్పటి నుంచి జోనల్ పరిధి ప్రజలు తమ సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలని వాపోతున్నారు. కింద స్థాయి సిబ్బంది విశాఖ వెళ్లాలని ఉచిత సలహా ఇస్తున్నారని చెబుతున్నారు.

టౌన్ ప్లానింగ్ పర్మిషన్ కోసం తిప్పలు..

పట్టణ ప్రజలు గృహాలు నిర్మించుకోవాలంటే తప్పనిసరిగా జోన్ టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి పర్మిషన్ తీసుకోవాలి. మూడు మాసాలుగా టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు ప్రధాన విభాగంలో అధికారులు లేకపోవడంతో గృహాలు నిర్మించుకునే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇందుకోసం కార్యాలయానికి వచ్చే వారిని విశాఖ వెళ్లాలని కింద స్థాయి సిబ్బంది చెప్పడంతో విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో ఇదే పరిస్థితి....

జోన్ పరిధిలో ఇంజనీరింగ్ విభాగంలో రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, ప్రభుత్వ శాఖ కార్యాలయాల భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. జోన్ డిప్యూటీ ఇంజనీర్ పోస్టు ఖాళీగా దర్శనమిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. కార్యాలయంలో దిగువ స్థాయి సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ వర్కులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

పబ్లిక్ హెల్త్ విభాగంలో...

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలంటే పబ్లిక్ హెల్త్ విభాగంలో ఐదు వార్డులకు ఒక అధికారి ఉండాలి. ఈ పోస్టు ఖాళీగా ఉండడమే కాకుండా దిగువ స్థాయి సిబ్బంది అరకొరగా ఉన్నారు. ఉన్న సిబ్బంది మాత్రమే పారిశుధ్యం, డ్రైనేజీలపై దృష్టి పెట్టి తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు.

రెవెన్యూ అధికారి ఎక్కడ....

జోన్ పరిధిలో కమిషనర్ తర్వాత రెవెన్యూ అధికారి పాత్ర కీలకమైనది. రెండు సంవత్సరాలుగా ఈ పోస్టును డిప్యూటేషన్‌పై నడపడంతో జోన్ పరిధిలో సకాలంలో జరగాల్సిన పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. జోన్ కమిషనర్, రెవెన్యూ అధికారి పోస్టులు రెండు పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదు. కార్యాలయంలో దిగువ స్థాయి ఉద్యోగికి తాత్కాలికంగా రెవెన్యూ పోస్టును అప్పగించారు.

12 ఏళ్లుగా పోరాటాలు...

మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత నేటి వరకూ పూర్తిస్థాయిలో పోస్టులను భర్తీ చేయలేదు. ప్రజా సంఘాలు, జీవీఎంసీ యూనియన్ నాయకులు, ప్రజలు జోనల్ కార్యాలయం వద్ద 12 ఏళ్లుగా పలు పర్యాయాలు ధర్నాలు చేస్తే, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి డిప్యూటేషన్‌పై అనకాపల్లి జోన్‌కు పంపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని జోన్ పరిధిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



జోనల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కమిషనర్ సీటు

ఉన్న సిబ్బందిపై పని భారం..

ఇలా అన్ని విభాగాల్లో పోస్టులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగిపోతోంది. దాంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కింద స్థాయి ఉద్యోగులు ఎక్కడికైనా బదిలీపై వెళ్లిపోవాలని ఉన్నత స్థాయి అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. పైగా అంతర్గత పదోన్నతులు సకాలంలో లభించక, సర్వీసుల్లో సీనియారిటీ కోల్పోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పాలకులు జోన్ పరిధిలో పోస్టులను భర్తీ చేసి పాలనను గాడిన పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్‌లో ఎందుకు కలిపినట్టు?



మూడు మాసాలుగా జోనల్ కార్యాలయంలో కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి, రెవెన్యూ అధికారి, పబ్లిక్ హెల్త్ అధికారి లేరు. జిల్లా కేంద్రంలో జోన్ అధికారి లేకుండా కార్యాలయంలో దిగువ స్థాయి సిబ్బందితో పనులు ఏమి జరుగుతాయి. ప్రజల సమస్యలు ఎవరితో చెప్పుకోవాలి. ఉన్న సిబ్బంది పనులు చేయాలని కోరితే విశాఖ వెళ్లాలని సూచిస్తున్నారు. ఇదే పరిస్థితి ఉంటే కార్పొరేషన్‌లో అనకాపల్లి మున్సిపల్‌ను ఎందుకు విలీనం చేశారో అర్థం కావడం లేదు.

– కొణతాల హరనాథ్‌బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, అనకాపల్లి

క్లుప్తంగా

హై ఓల్టేజ్‌తో గృహోపకరణాలు దగ్ధం



హై ఓల్టేజ్ కారణంగా కాలిపోయిన ఏసీ

అనకాపల్లి: మండలంలో కొత్తూరు శారదానగర్‌లో నిత్యం హై ఓల్టేజ్ కారణంగా గృహాల్లో వివిధ ఎలక్ట్రికల్ పరికరాలు పాడైపోతున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శారదానగర్-4వ వీధిలో గురువారం రెండు గృహాల్లో ఏసీలు, టీవీలు కాలిపోయాయని ఆయా ప్రాంతాల బాధితులు వాపోయారు. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకుని హై ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని నరసింగబిల్లి, చింతలపాలెం, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, ఏనుగుతుని, సోమవరం, చిన ఏనుగుతుని, జి. భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు నిర్దేశిత సమయంలో విద్యుత్ అంతరాయం కలగనుందన్నారు. దీని దృష్ట్యా ఆయా గ్రామాల వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు కాస్త పెరిగాయి. వంకాయలు, కాకరకాయలు కిలో రూ.80కి విక్రయించారు. బంగాళదుంప రూ.40, ఉల్లి రూ.50 నుంచి రూ.60, టమాటా, క్యారెట్ , దొండకాయ బీరకాయలు, బెండకాయ, బరబాటి రూ.60, చామదుంప రూ.80, ఆగాకర రూ.వందకు విక్రయాలు సాగాయి.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 1347బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,810	5,500
మొదటి రకం	4,130	5,230
రెండో రకం	3,520	4,520
మూడోరకం	3,350	3,500

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
వీణం 3డి 2	:సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పద్మిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
నరుడి బతుకు నటన	: వెంకటేశ్వర
ఎంత పనిచేసావ్ చంటి	:శ్రీసత్య
పొట్టేల్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్- 4 యూనిట్లు, బీ పాజిటివ్-32 యూనిట్లు, ఓ పాజిటివ్-31 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ 9703619706ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని నిరసన

తుమ్మపాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటైజేషన్, సెక్యూరిటీ, వేస్ట్ కంట్రోల్ కార్మికులకు ప్రభుత్వ జీవో 549, కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ నెలల తరబడి చెల్లించకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్లను, వారి లైసెన్స్ రద్దు చేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో కార్మికుల నిరసన కార్యక్రమం 54వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. మిగతా జిల్లాల్లో మాదిరిగా కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్మిక శాఖ అధికారుల ద్వారా కాంట్రాక్టర్లను అడిగిన ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఎస్.సంతోష్, అడ్డా ప్రసాద్, వడ్డాది పోలరావు, అడవి రాజు, ఎస్. కిరణ్, కొండపల్లి వరలక్ష్మి, వడ్డాది ఉమా, వి.ఎం. నాయుడు, కుంద్రపు వరలక్ష్మి, మహేశ్వరి, ఆర్. జ్యోతి, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి నిరసన చేస్తున్న కోన లక్ష్మణ

ఇళ్లకు వెళ్లి ప్రోగ్రెస్ కార్డులు అందజేత

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో 'విద్యార్థి మేలుకో' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వినూత్నంగా స్వీయ అంచనా పరీక్షల ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులను ఉపాధ్యాయులు ఇళ్లకు వెళ్లి అందజేశారు. వెదురుపర్తి హైస్కూలు గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, వై.విజయ్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు చదువుతున్న పాఠ్యాంశాలను తెలుసుకున్నారు. వాటిలో సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థుల చదువు తీరును తెలియజేసే ప్రోగ్రెస్ కార్డులో సమాచారాన్ని తల్లిదండ్రులకు వివరించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వారంలో మూడు రోజులపాటు విద్యార్థి మేలుకో కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల తమ పిల్లలు వేకువజామున నిద్ర మేల్కొని టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతూ శ్రద్ధ చదువుతున్నారని తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల ఆరోగ్యానికి పౌష్టికాహారాన్ని అందిస్తుండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.



వెదురుపర్తిలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్నప్పటి ఉపాధ్యాయులు

పాల సేకరణ ధర పెంచాలంటూ రైతుల నిరసన

పరవాడ: విశాఖ మిల్క్ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరను రూ.5 తగ్గించి రైతులకు నష్టం కలిగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. పాల సేకరణ ధర తగ్గింపును వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులు గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ పాల ధరను అర్థంతరంగా తగ్గించడాన్ని రైతులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. పాడి రైతులకు ఇవ్వాల్సిన బోనస్ ఇవ్వకుండా డెయిరీ యాజమాన్యం మోసం చేసిందన్నారు. పశువుల దాణా ఖర్చులు పెంచి రైతులపై భారం మోపిందని ధ్వజమెత్తారు. తగ్గించిన పాల ధరను వెంటనే పెంచని పక్షంలో ఈ నెల 29న డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కె.రామసూరప్పారావు, కృష్ణ, పాడిరైతులు పి.శంకర్రావు, బి.అప్పలనాయుడు, రెడ్డి నాయుడు, సతీష్, పి.పైడింనాయుడు, బండారు చిన్నోడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పాల సేకరణ ధర తగ్గింపుపైనిరసన తెలుపుతున్న రైతులు

గెడ్డవాగులో వేసిన పైపుల తొలగింపు

పరవాడ: మండలంలోనికలపాక రెవెన్యూ పరిధి మరిశవానిపాలెం సమీపంలోని గెడ్డ వాగులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమంగా వేసిన పైపులను గురువారం తొలగించినట్టు కలపాక వీఆర్వో నారాయణమ్మ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ భూములకు గెడ్డ వాగు నుంచి పైపులు ఏర్పాటు చేశారన్నారు. సమాచారం అందడంతో సదరు స్థలాన్ని పరిశీలించి పైపులను తొలగించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములు, గెడ్డ వాగుల ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గెడ్డవాగులో అక్రమంగా వేసిన పైపులను తొలగిస్తున్న దృశ్యం

బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికుడికి తీవ్ర గాయాలు

మునగపాక: మండలంలోని చూచుకొండలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జల్లూరి దేమునికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గణపర్తికి చెందిన దేముడు పంచాయతీ పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి చూచుకొండ నుంచి ఇంటికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఆయనను బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. మునగపాక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రుడు దేముడు

'బొజ్జన్నకొండ పరిసరాల్లో అపరిశుభ్రత'

తుమ్మపాల: పట్టణానికి సమీపంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న బొజ్జన్నకొండ పరిసరాల్లో స్వచ్ఛతా హీ సేవ వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ప్రాచుర్యం పొందిన బొజ్జన్నకొండకు నిత్యం అనేక మంది సందర్శకులు వస్తున్నారన్నారు. వీరికి ఇక్కడ అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు వెక్కిరిస్తున్నాయని వాపోయారు. టూరిజం శాఖ అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా కనిపిస్తుందన్నారు. బుద్ధ భగవానుని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అసౌకర్యాల కొరత ఉందన్నారు. పరిసరాల్లో చెత్తాచెదారంతోపాటు గుబురుగా పెరిగిన తుప్పలు వల్ల పాముల బెడద ఎక్కువగా ఉందన్నారు. బౌద్ధ స్థూపాలున్న కొండ పైన ఎక్కువగా తుప్పలు ఉన్నాయని, లింగాలకొండకు వెళ్లే దారి అత్యంత భయంకరంగా ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా చూడాలని కోరారు.

నేటి నుంచి గ్రామాల్లో పశుగణన సేకరణ

అనకాపల్లి: మండలంలో అన్ని గ్రామాల్లో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకూ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా సహాయ సంచాలకురాలు బి.సౌజన్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశుగణన కోసం మండలంలోని 15 మంది పశు సంవర్ధక శాఖ సిబ్బందిని విషయ సేకరణదారులుగా నియమించగా, పశువైద్యాధికారులు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. పశుగణన అనేది పశు సంవర్ధక శాఖలోని వివిధ రకాల పథకాల రూపకల్పనకు, టీకాల తయారీకి, మందుల పంపిణీకీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు, ఇతర జీవాల సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు.

రెవెన్యూ గ్రామసభకు 59 అర్జీలు

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామసభకు విశేష స్పందన లభించింది. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు సమక్షంలో నిర్వహించిన సభలో ప్రజల నుంచి 59 అర్జీలు స్వీకరించారు. భూముల కొలతల్లో హెచ్చు తగ్గులు, సవరణలు తదితర వాటి కోసం అర్జీలు వచ్చాయి. రీ-సర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, ఆర్ఐ రమేష్, మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎస్ పేట గ్రామంలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ గ్రామ సభ జరగనుందని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. సభకు హాజరై భూ సమస్యలను రైతులు పరిష్కరించుకోవాలని కోరారు.

ఉపాధి పనులపై విచారణ



కూలీల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో మేరి రోజ్

గొలుగొండ : పుత్తడిగైరంపేట గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయని కొంత మంది గ్రామస్తులు జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదులపై గురువారం ఎంపీడీవో మేరీ రోజ్, ఏపీవో సూర్యమణి గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో కూలీల నుంచి వివరాలు సేకరించారు. ఇప్పటి వరకు ఎంత నిధులు ఖర్చు జరిగింది, ఎంత మంది కూలీలు పనులకు వెళ్లారో వివరాలు సేకరించారు. ప్రధానంగా ఇచ్చిన ఫిర్యాదులపై వివరాలు సేకరించారు. పూర్తి నివేదిక జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

మహిళా కాలేజీల పరిసరాల్లో పోలీస్ గస్తీ

ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక వినతి

అనకాపల్లి: పట్టణ పరిధిలో మహిళా కళాశాలల పరిసర ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఆకతాయిలకు అడ్డుకట్టు వేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ టి.వి.విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చిన్నియాదవ్ మాట్లాడుతూ ఆకతాయిల అల్లరి చేష్టలతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. వీరికి రక్షణ కల్పించేందుకు పోలీస్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. శుభకార్యాలు, ఉత్సవాల్లో డీజే సౌండ్‌కు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, రాత్రి 12 గంటలకు ప్రజల నిద్రకు ఆటంకం కలుగుతుందని, పట్టణ పరిధిలో విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, అటుగా వెళ్లే మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే స్టేషన్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, శారదా నది బ్రిడ్జి తదితర మార్గాల ద్వారా తరలిస్తున్న గంజాయి స్మగ్లర్స్‌పై పోలీస్ శాఖ దృష్టి సారించాలని, రాత్రిళ్లు యువత విచ్చలవిడిగా వాహనాలు రోడ్డు మధ్యలో పెట్టి జన్మదిన వేడుకలు చేసుకుంటూ ఆయా ప్రాంతాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. వీధిల్లో ప్రధాన జంక్షన్ల వద్ద సెల్‌ఫోన్లలో రమ్మీ గేమ్స్ ఆడుతున్నారని, వీటికి అడ్డుకట్ట వేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాము, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, సాయిబాబు, దేముళ్లు పాల్గొన్నారు.



సీఐ విజయకుమార్‌తో మాట్లాడుతున్న ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్

కుక్, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు

తుమ్మపాల: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో వార్డెన్లను నియమించాలని, విద్యార్థులకు తగిన రక్షణ కల్పించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. పట్టణంలో ఆర్డీవో కార్యాలయంలో వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయ సూపరిండెంటెంట్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం గాంధీనగర్ బాలుర వసతి గృహంలో భోజనం పెట్టాలని అడిగిన విద్యార్థిని కుక్ తీవ్రంగా గాయపడేలా కొట్టడం దారుణమన్నారు. అతడితోపాటు బాధ్యుడిగా వార్డెన్ మీద చర్యలు చేపట్టాలని కోరారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలకు కారణమన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో వార్డెన్ల నియామకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ప్రతినిధి కొల్లి చినఅప్పారావు, ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక పార్లమెంట్ ఇన్‌చార్జి ఉడింగల నాగేంద్రకుమార్, బీఎస్పీ మండల అధ్యక్షుడు వనమాల నాగభూషణం, దళిత బహుజన ఆదరణ సేవా సమితి కార్యదర్శి కొల్లి సత్యారావు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం సూపరిండెంటెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న మాణిక్యాలరావు

పెద్దేరు, తాచేరు వంతెన పనులు పూర్తి చేయాలి

బుచ్చెయ్యపేట : మండలంలో దెబ్బతిన్న పెద్దేరు, తాచేరు వంతెన పనులు చేపట్టకపోతే ప్రజలు రోడ్డెక్కి నిలదీసే పరిస్థితులు వస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈర్లె శ్రీరామ్మూర్తి తెలిపారు. గురువారం శ్రీరాంపట్నం తన ఇంటి వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం, చోడవరం, పాడేరు, విశాఖ, అనకాపల్లి రహదారులు వర్షాలకు బాగా దెబ్బతిని ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్డీయేలో ఉన్న మేం ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు మిత్ర పక్షమైన ప్రజా సమస్యల పట్ల స్పందించకపోతే ప్రజలకు మేం సమాధానాలు చెప్పలేమన్నారు. కొత్తగా రోడ్లు, జలశయాలు కట్టకపోయినా దెబ్బతిన్న వాటికి మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. వడ్డాదిలో కూలిన పెద్దేరు, విజయరామరాజుపేటలో తాచేరు వంతెనలు కూలిపోగా వీటి నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి ఆరు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న పెద్దేరు, తాచేరు, కోనాం, మేహాద్రిగెడ్డ, రైవాడ, కల్యాణలోవ, తాండవ జాలాశయాలకు మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. రిజర్వాయర్ల వద్ద పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలన్నారు. ఈ నెల 26వ తేదీన పి.భీమవరం గ్రామానికి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే రాజు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు వస్తున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రమణమూర్తి, జిల్లా కార్యదర్శి రాజేష్, మండల బీజేపీ అధ్యక్షుడు సీతా నాగరాజు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్మూర్తి తదితరులు